సాక్షి చిత్తూరు

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



కాటేస్తున్న బీపీ, మధుమేహం..!

జిల్లాలో బీపీ, మధుమేహం కేసులు పెరుగుతున్నాయి. ఇందుకు మారుతున్న జీవన విధానమే కారణమని వైద్యులు చెబుతున్నారు. - IIలో



పోటాపోటీగా టేబుల్ టెన్నిస్

చిత్తూరులోని బృందావన్ పాఠశాలలో టేబుల్ టెన్నిస్ పోటీలు పోటాపోటీగా సాగాయి. - IIలో



నేరాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో నేరాల నియంత్రనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

వసతి సముదాయానికి రూ.6.50 లక్షల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని వసతి సముదాయానికి పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన శ్రీనివాసరావు, ఉమాదేవి రూ.6.50 లక్షల విరాళం ఇచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఆర్వో మోహన్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్ : డీఆర్వో పుల్లయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నూతన డీఆర్వోగా విశాఖపట్టణం జిల్లా డీఆర్వోగా పనిచేస్తున్న మోహన్‌కుమార్‌ను నియమించింది. పుల్లయ్యను జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. నూతన డీఆర్వో రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిసింది. అలాగే జిల్లాలో మరో ఇద్దరు ఆర్డీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. పలమనేరు ఆర్డీవోగా ఈ నెల 23న బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌ను బదిలీ చేసి జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. తాడేపల్లిగూడెం ఆర్డీవో భవానిశంకరిని నగరి ఆర్డీవోగా నియమించింది. నగరి ఆర్డీవోగా పనిచేస్తున్న వెంకటరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని పేర్కొంది. చిత్తూరు కలెక్టరేట్‌లో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న భవానిని పలమనేరు ఆర్డీవోగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

డీఈఓగా వరలక్ష్మి

– ప్రస్తుత డీఈఓ దేవరాజు బదిలీ



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమె ప్రస్తుతం అనంతపురం డీఈఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈఓ దేవరాజును బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్ర విద్యాశాఖలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. దేవరాజు జిల్లాలో ఏడాదికి పైగా డీఈఓగా పనిచేస్తున్నారు. పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. డీఈఓగా వస్తున్న వరలక్ష్మి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2016లో డీఈవో కార్యాలయంలో సూపరింటిండెంట్, ఏడీ–2గా విధులు నిర్వహించారు. అనంతరం ఉద్యోగోన్నతిపై వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె జిల్లాలో మొట్టమొదటి మహిళా డీఈఓగా విధులు నిర్వర్తించనున్నారు. నూతన డీఈఓ రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిరాశ్రయుల కేంద్రం తనిఖీ



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచిలో ఉన్న నిరాశ్రయుల కేంద్రాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవిఎస్.పద్మజ తనిఖీ చేశారు. ఈ కేంద్రం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ అభాగ్యులకు అందుతున్న సేవలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆదరణలేని నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జోసెఫ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై బస్సు సర్వీసు పునః ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని వ్యాపారుల సౌకర్యార్థం ఆర్టీసీ చెన్నై బస్సు సర్వీసును పునః ప్రారంభిస్తున్నట్లు వన్‌డిపో డీఎం క్రిష్ణమూర్తి తెలిపారు. ఈ బస్సు ప్రతి సోమవారమూ ఉదయం 4.15 గంటలకు చిత్తూరు ఆర్టీసీ బస్టాండు నుంచి బయలుదేరుతుందన్నారు. చెన్నై నుంచి ఉదయం 9.15 గంటలకు తిరిగి బయలుదేరుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



- చిత్తూరు సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్.హర్షవర్ధన్ బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.25 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సంపాదించాడు. ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగంలో చేరాలని కంపెనీ షరతు పెట్టింది. పెండింగ్ ఫీజు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీ కొర్రీ పెట్టింది. కూటమి ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకపోవడంతో హర్షవర్ధన్ అప్పుచేసి కాలేజీలో ఫీజు చెల్లించాడు. ఆ డబ్బుకు నెలనెలా వడ్డీ కడుతున్నాడు.

- బైరెడ్డిపల్లి మండలం ఎస్టీ కాలనీకి చెందిన మునస్వామి కుమారుడు రమేష్ గత ప్రభుత్వంలో తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ పూర్తి చేశాడు. ఇటీవల పీజీ సెట్ రాసి అందులో క్వాలిఫై అయ్యాడు. మొన్న జరిగిన కౌన్సిలింగ్‌లో ఒక ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో సీటు వచ్చింది. అందులో చేరేందుకు వెళ్లగా అడ్మిషన్ సమయంలోనే యూనివర్సిటీకి రూ.80 వేలు ఫీజు కట్టాలని చెప్పారు. తల్లి దండ్రులు అప్పు చేసి రూ.80 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఇలా జిల్లా వ్యాప్తంగా ఉన్నత విద్యనభ్యసిస్తున్న వేలాది మంది పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

ఫీజు కట్టాల్సిందే!

- ఒత్తిడి చేస్తున్న కళాశాలల యాజమాన్యం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ఫీజు బకాయిలు చెల్లించని కూటమి సర్కారు
- గత ఐదేళ్లలో సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్
- పథకాన్ని నీరుగారుస్తున్న కూటమి పాలకులు

విద్యతోనే పేదరికం దూరమవుతుంది. పేద పిల్లలు ఉన్నత విద్య చదవడం ద్వారా వారి కుటుంబాలు బాగుపడతాయని దివంగత నేత వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేశారు. ఎంతోమంది పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారు. దాన్ని ఆయన తనయుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి యథాతథంగా కొనసాగించారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అసలు ఇస్తుందా..? లేదా అనే విషయంపైనా స్పష్టత ఇవ్వకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీల యాజమాన్యాలు మెలిక పెట్టడంతో ఉన్నత చదువులకు వెళ్లేందుకు, ఉద్యోగాల్లో చేరేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాలో 116 డిగ్రీ, 14 ఇంజినీరింగ్, 11 ఎంబీఏ, ఎంసీఏ, 18 ఐటీఐ, 7 నర్సింగ్, 8 పాలిటెక్నిక్, 2 మెడికల్, 7 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. వాటిలో 24,149 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. టర్మ్ ఫీజు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం భరోసాగా ఉండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పేరుతో విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ వచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకాల పేర్లు మార్చి నిధులపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు మిడ్ పరీక్షలు పూర్తి కావడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి.



జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

నోరు మెదపని కూటమి సర్కారు

క్షేత్రస్థాయిలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఫీజు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసినప్పటికీ కూటమి సర్కారు నోరు మెదపడం లేదు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఎన్నికల సందర్భంగా ఆగిపోయిన నిధుల మంజూరు విషయం గురించి ఇంత వరకూ పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో సాహసోపేత నిర్ణయం

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్–1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. అయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా భరించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. అందులో భాగంగానే జగనన్న విద్యాదీవెన పేరుతో ఆయా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని చెల్లించారు.

చంద్రబాబు పెట్టిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017–18, 2018–19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఫీజులు పెండింగ్‌లో పెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటికి వెంటనే విడుదల చేసి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చేశారు. అలాగే టీడీపీ హయాంలో కుటుంబ వార్షిక ఆదాయ పరిమిత రూ.లక్ష ఉండేది. దాన్ని జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది. తద్వారా వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలని భావించారు. ఈ నేపథ్యంలోనే వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.23 వేల ప్రకారం అందించింది.

జిల్లాలోని కళాశాలల సమాచారం

డిగ్రీ కళాశాలలు	116
ఇంజినీరింగ్ కళాశాలలు	14
ఐటీఐ కళాశాలలు	18
నర్సింగ్ కళాశాలలు	07
పాలిటెక్నిక్ కళాశాలలు	08
మెడికల్	02
బీఈడీ కళాశాలలు	07
ఎంబీఏ, ఎంసీఏ	11
మొత్తం కళాశాలలు	183

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ.లక్షల్లో)
చిత్తూరు	2,517	4,82,02,359
నగరి	3,444	6,20,96,235
పుంగనూరు	4,694	8,76,63,867
పూతలపట్టు	3,006	6,28,15,905
పలమనేరు	4,252	6,99,16,920
కుప్పం	3,049	5,04,42,063
గంగాధరనెల్లూరు	3,187	6,64,84,512
మొత్తం	24,149	44,76,21,861

ఐదేళ్లలో రూ.940.62 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ తదితర సామాజిక వర్గాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.940.62 కోట్లు జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఫీజుల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని కొన్ని కళాశాలలు తేల్చి చెబుతున్నాయి.

ఇబ్బందులు పెడుతున్నారు



మా అమ్మాయి వర్ష కుప్పంలో డిగ్రీ చదువుతోంది. ఫీజు చెల్లించాలని కళాశాలలో ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని ఆశపడ్డాం. ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఫీజులు చెల్లించకపోతే కళాశాలకు రావొద్దని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. గత ప్రభుత్వం సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు మా ఖాతాల్లో వేసేది.

– స్వప్న, విద్యార్థిని తల్లి, కుప్పం

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



నా కుమార్తె రేష్మ ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్, కుమారుడు ఉదయ్ ఎస్వీ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో ఇవ్వడంతో ఇబ్బంది పడలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడు టర్ముల ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాలల్లో ఒత్తిడి పెరుగుతోంది. వెంటనే బకాయిలు మంజూరు చేయాలి.

– కవిత, ముడిపల్లె, నగరి మండలం

బకాయిలు త్వరగా చెల్లించాలి



నా కుమార్తె చిత్తూరులో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. గత విద్యాసంవత్సరం సమయానికి ఫీజు నగదు ఖాతాలో జమయ్యేది. ఇప్పుడు ఇంత వరకు ఫీజు నగదు పడలేదు. ఫీజు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. మాతో పాటు చాలా మంది తల్లిదండ్రులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలి.

– లక్ష్మి, బంగారుపాళ్యం

ఫీజు చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారు



నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఫీజు కట్టలేని పరిస్థితి మాది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనే నమ్మకంతో ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్‌లో చేరాను. ఈ ప్రభుత్వం ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. ప్రస్తుతం నా పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బడ్జెట్ విడుదల చేయాలి.

– ప్రదీప్, వెంగల్‌రాజుకుప్పం, పాలసముద్రం

అండర్–17 వాలీబాల్ విజేత చిత్తూరు



బంగారుపాళెంలో జిల్లా బాలుర జట్టుతో అధికారులు, ప్రజాప్రతినిధులు

- రన్నర్‌గా నిలిచిన బాలికల జట్టు
- క్రీడాకారులను అభినందించిన అధికారులు


బంగారుపాళెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్ర స్థాయి బాలబాలికల వాలీబాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్లు విజేతగా నిలిచిందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిరాజ్, సుదర్శన్‌నాయుడు తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లా హిందూపుర్‌లోని ముద్దిరెడ్డిపల్లెలో ఈ నెల 21 నుంచి 23 వరకు 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలబాలికల వాలీబాల్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో చిత్తూరు, గుంటూరు జిల్లా జట్లు తలపడ్డాయన్నారు. గుంటూరు జట్టుపై చిత్తూరు బాలుర జట్టు విజయకేతనం ఎగురవేసిందని తెలిపారు. బాలికల విభాగంలో గుంటూరు, చిత్తూరు జట్ల మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు బాలికల జట్టుపై గుంటూరు జట్టు విజయం సాధించిందన్నారు. జిల్లాకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో బంగారుపాళెం మండలానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. పలువురు గ్రామీణ ప్రాంత క్రీడాకారులు వాలీబాల్ క్రీడలో రాణించడం అభినందనీయమని వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లను పలువురు వాలీబాల్ క్రీడాకారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజేంద్రన్, పీడీలు గిరిజ, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

'దౌర్జన్యంగా టెండర్లు లాక్కున్నారు'



మాట్లాడుతున్న గంగిరెడ్డి, పక్కన రమేష్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దుకాణాలకు పొందిన టెండర్లు, వేలం పాటల హక్కులను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా లాక్కొన్నార ని బాధితుడు కొలింపల్లెకు చెందిన గంగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గురువారం చౌడేపల్లెలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు పలు హక్కులకు సంబంధించి ఫిబ్రవరి 3న అధికారులు బోయకొండ ఆలయం వద్ద టెండర్లు, వేలం పాటలు నిర్వహించారని తెలిపారు. తాను రూ.20.10 లక్షల తో కూల్ డ్రింక్స్, క్యాంటీన్ నిర్వహణ హక్కు, రూ.4.52 లక్షలతో కొండ కింద చికెన్ షాపు నిర్వహణ కోసం పంచాయతీ నుంచి హక్కు పొందినట్లు తెలిపాడు. తలనీలాలు సేకరించే హక్కును రూ.39.10 లక్షలకు వేలంలో దక్కించుకున్నానని వెల్లడించారు. అలాగే రూ.7.50 లక్షలకు బండ్లపై ఆర్చి నుంచి బోయకొండ ఆర్చి వరకు సరిహద్దుల్లో చికెన్ షాపుల ఏర్పాటు, కొలింపల్లె క్రాసు నుంచి పెద్దూరు హద్దు వరకు చికెన్ షాపుల ఏర్పాటుకు రూ.7.50 లక్షలకు లడ్డూ రమణ, రూ.6.63 లక్షలకు ప్రసాద్ హక్కులు పొందినట్టు తెలిపారు. క్యాంటీన్ ఏర్పాటుకు రూ.3 లక్షలకు హక్కు పొందినట్టు తెలిపారు. టీడీపీ నాయకులు తమను భయపెట్టి అనధికారికంగా దుకాణాలు పెట్టుకుని అనుభవిస్తున్నారని, తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. బోయకొండ పరిసరాల్లో దౌర్జన్యకాండను కొనసాగిస్తూ ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి తమకు న్యాయం చేయాలని గంగిరెడ్డి, అతని సహచరుడు రమేష్ కోరారు.



బాధితుడి నగదు చెల్లింపు రశీదులు

షీ బాక్స్ ఏర్పాటు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళా ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో షీ బాక్సులు ఏర్పాటు చేయాలని ఏపీ జేఏసీ మహిళా విభాగం సభ్యులు కోరారు. వారు గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయ ని తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయాలంటే మహిళా ఉద్యోగులు భయపడుతున్నారని చెప్పారు. షీ బాక్సులు పెడితే బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో షీ బాక్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్మన్ శివకుమారి, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మీ, జిల్లా జేఏసీ చైర్మన్ జయంతి, ప్రధాన కార్యదర్శి పుష్పలత పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మామిడి పంట పూత దశ నుంచి కోత వరకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించేలా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలోని మ్యాంగో భవన్‌లో గురువారం మామిడి పంట సస్యరక్షణ చర్యలపై సచివాలయ ఉద్యాన, వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. సాగు విధానంలో శ్రేష్టమైన, అధునాతన పద్ధతులు, పంట తెగుళ్లను నివారించడంలో రైతులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలన్నారు. మామిడి చెట్లకు సూర్యరశ్మి బాగా తగిలేలా చూడడం ద్వారా చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. చెట్టు వయసును బట్టి పశువుల ఎరువులు, యూరియా, సూపర్ పాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అందించాలన్నారు. డ్రిప్ ద్వారా ప్రతి మూడు రోజులకు ఒకసారి చెట్టుకు 200–300 లీటర్ల చొప్పున డ్రిప్పర్‌ల ద్వారా నీరు అందిస్తే ఎక్కువ శాతం వేర్లకు నీరు అందుతుందన్నారు. తక్కువ దిగుబడి రావడంతోపాటు మార్కెట్‌లో మంచి ధరలు పలకని రకాల మొక్కలకు తలమార్పిడి పద్ధతులను అవలంబించి అధిక దిగుబడినిచ్చే మొక్కలను అంటుకట్టాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ, ఏపీఎంఐపీ అధికారులు మధుసూదన్ రెడ్డి, మురళీకృష్ణ, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదళ్లలో పులి సంచారంపై పుకార్లు

పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో బుధవారం రాత్రి చిరుతపులి సంచరించిందని పుకార్లు రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. దీంతో ఫారెస్ట్ అధికారులు గురువారం గ్రామానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్హెచ్ఓ ప్రభావతిదేవి అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం ఆమె జిలా అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. వాటి వివరాలను విధిగా ఐహెచ్ఐపీ పోర్టల్లో నమోదుచేయాలన్నారు. అదేవిధంగా ప్రతి వారమూ నీటి పరీక్షలు చేసి వెక్టార్ హైజన్ యాప్లో నమోదు చేయాలని సూచించారు. డయేరియా కేసుల నియంత్రణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, అధికారులు అనిల్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

– జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



పోలీసు స్టేషన్ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట : జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆయన గురువారం వి.కోట పోలీసు స్టేషన్ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక పోలీసు స్టేషన్లోని కమాండ్ కంట్రోల్ రూమ్లో సీసీ కెమెరాల పనితీరును మెరుగుపరిచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల పర్యవేక్షణలో స్టేషన్లో 24 గంటలు నిఘా పెంచడానికి కమాండ్ కంట్రోల్ రూమ్ను మరింత ఆధునికీకరిస్తామని వెల్లడించారు.

సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు, బంగారుపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గంటామోహన్కు ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులను డీఈఓ దేవరాజు గురువారం వెనక్కు తీసుకున్నారు. ఈ మేరకు గతంలో జారీచేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేస్తూ కొత్త ఉత్తర్వులను జారీ చేశారు.

కాటేస్తున్న బీపీ, మధుమేహం...!

- జిల్లాలో పెరుగుతున్న బీపీ, మధుమేహం కేసులు
- ఆరోగ్య సూత్రాలు పాటించాలంటున్న వైద్యులు

ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఉరుకులు, పరుగులతోపాటు మారిన జీవన విధానంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. 40వ పడిలోకి వచ్చేసరికే రక్తపోటు, మధుమేహం వంటి రుగ్మతల బారిన పడుతున్నారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో 40 ఏళ్లు దాటిన ప్రతి వంద మందిలో 22 మంది రక్తపోటు, 18 మంది మధుమేహంతో బాధ పడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. చాలా మంది ఆస్పత్రికి దూరంగా ఉండడంతో మరిన్ని కేసులు బయటపడడం లేదు. తీవ్ర అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి కొన్ని రకాల పరీక్షలు చేసే సమయంలో ఈ రెండు వ్యాధులు వెలుగులోకి వస్తున్నాయి.

– చిత్తూరు రూరల్

మహిళలే అధికం...

చాలా మంది మహిళలు ఉదయం అల్పాహారం తీసుకోవడం లేదు. దీంతో గ్యాస్ట్రిక్ సమస్యతో పాటు హార్మోన్ల అసమతుల్యత, మధుమేహం వంటి రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 16–30 ఏళ్ల మధ్య ఉన్న వారు సరిగా తినకపోవడం వల్ల ఊబకాయం, అండాశయంలో నీటి బుడగలు, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జల్లెడ...

వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్ద పీట వేసింది. ఇంటి పట్టునే వైద్య సేవలను అందించింది. ఈ తరుణంలో జబ్బులు గుర్తించడం సులభతరమైంది. జగనన్న ఆరోగ్య రక్ష పేరుతో ప్రతి ఇంటా ఆరోగ్య పరీక్షలు చేసి అనారోగ్య సమస్యలను జల్లెడ పట్టారు. ఈ సర్వేలో ప్రధానంగా బీపీ, మధుమేహం కేసులు వేల సంఖ్యలో బయటపడ్డాయి. వారందరికీ హెల్త్ క్యాంపులు నిర్వహించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అది కూడా చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

- బంగారుపాళ్యానికి చెందిన రమీల వయసు 39. ఆమెకు ఇటీవల విపరీతమైన తలపోటు రావడంతోపాటు ముద్ద గొంతు దిగకపోవడం, కళ్లు తిరగడంతో ఆస్పత్రికి వెళ్లింది. పరిశీలించిన వైద్యులు రక్తపోటు ఉందని నిర్ధారించారు.
- చిత్తూరు నగరానికి చెందిన కార్తికేయ వయసు 35. ఆయన ఇటీవల అస్వస్థతకు గురికావడంతో జిల్లా ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షలు చేసిన వైద్యులు మధుమేహం ఉన్నట్లు నిర్ధారించి క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు.
- చిత్తూరు మండలానికి చెందిన విజయకుమార్కు తల తిరగడం, శరీరం నీరసంగా ఉండడం, ఆకలి మందగించడంతో ఆస్పత్రికి వెళ్లారు. మందులు వాడినా తగ్గలేదు. అనంతరం పరీక్షిస్తే బీపీ ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఆయన మందులు వాడుతున్నారు.



బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



మధుమేహ పరీక్షలు చేస్తున్న వైద్యులు

జిల్లా సమాచారం

మొత్తం జనాభా
18,28,324
బీపీ ఉన్న వారు
1,33,408
మధుమేహం
11,11,815
రెండు సమస్యలు ఉన్నవారు
1,59,443

జిల్లాలోని ఆస్పత్రుల సమాచారం...

జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
సీహెచ్సీలు	8
అర్బన్ హెల్త్ సెంటర్లు	15
పీహెచ్సీలు	50

బీపీ లక్షణాలు

- తీవ్రమైన తలనొప్పి..
- ఊపిరి ఆడకపోవడం
- తలతిరుగుడు
- ఛాతీనొప్పి
- గుండె నొప్పి

మధుమేహం లక్షణాలు

- అనుకోకుండా బరువు తగ్గడం
- తగ్గని అలసట
- అస్పష్టమైన కంటి చూపు
- అధిక దాహం
- తరచుగా మూత్ర విసర్జన



ఆరోగ్య నియమాలు పాటించాలి



యోగా చేయడం, ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నూనె పదార్థాలు, మసాలా, కారం, ఉప్పు వినియోగం తగ్గించాలి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కనీసం ఆరు గంటలు నిద్రపోవాలి. శారీరక శ్రమ కూడా ఉండేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం కనీసం ఒక కిలోమీటరైనా నడవడం మంచిది.

– ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

నిర్లక్ష్యం వద్దు...



అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు తేలికగా తీసుకోవద్దు. ముఖ్యంగా తల తిరుగుడు, ఆకలి మందగించడం, తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. తేలికగా తీసుకోవద్దు. మధుమేహం, బీపీ ఉండి..నిర్లక్ష్యం చేస్తే అది గుండె నొప్పికి దారితీయవచ్చు. పట్టించుకోని పక్షంలో మనిషినే హరిస్తాయి. జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించడం ఉత్తమం.

–ప్రభావతిదేవి, డీఎంఅండ్హెచ్ఓ, చిత్తూరు

విధుల్లో అలసత్వం వద్దు

బంగారుపాళెం: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి హెచ్చరించారు. ఆమె గురువారం సాయంత్రం బంగారుపాళెంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. డయాలసిస్, ఫిజియోథెరపీ, ఐసీటీసీ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్లు విజయకుమారి, స్వరూప్నాయక్, అఖిల్, భావన, హెడ్నర్స్ సుమతి పాల్గొన్నారు.

ఏపీజేఏసీ జిల్లా చైర్పర్సన్గా జయంతి



జిల్లా మహిళా విభాగం చైర్మన్ జయంతి, కార్యదర్శి సరిత

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) అమరావతి జిల్లా మహిళా విభాగం చైర్మన్ గా జయంతి (డిప్యూటీ తహసీల్దార్, యాదమరి)ని ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవనంలో ఆ సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఏపీజేఏసీ కో–చైర్మన్గా లత (ఆర్టీసీ, చిత్తూరు), కార్యదర్శిగా సరిత (కలెక్టరేట్, చిత్తూరు)ను ఎన్నుకున్నారు. అలాగే సమగ్రశిక్ష శాఖ, రెవెన్యూ, సహకార శాఖలకు చెందిన 10 మందిని వివిధ కార్యవర్గాలకు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. చిత్తూరు డివిజన్ విభాగానికి చైర్మన్గా హిమగిరి, కో–చైర్మన్గా పుష్ప, కార్యదర్శిగా బిందుశ్వేతతో పాటు ఎనిమిది మంది ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, చైర్మన్ శివకుమారి లు నూతన సభ్యులను అభినందించారు.

పులి అవశేషాలు స్వాధీనం

- అదుపులో ఐదుగురు అనుమానితులు
- త్వరలో పూర్తి వివరాలు వెల్లడి
- డీఎఫ్ఓ భరణి



మాట్లాడుతున్న డీఎఫ్ఓ భరణి

చిత్తూరు కార్పొరేషన్: యాదమరి మండలం తాళ్లమడుగులో పులి చనిపోయిన ఘటనలో విచారణ ముమ్మరంగా చేస్తున్నట్టు డీఎఫ్ఓ భరణి తెలిపారు. ఆమె గురువారం సాయంత్రం వెస్ట్ ఎఫ్ఆర్వో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతు పొలంలో అడవి జంతువులను వేటాడడానికి వేసిన అక్రమ విద్యుత్ వైర్ల ఉచ్చులో పులి దెబ్బతిందని తెలిపారు. అచేతన స్థితిలో ఉన్న పులిని హింసించి చంపినట్లు పోస్టుమార్టం రిపోర్టు ద్వారా తెలిసిందన్నారు. ఇందులో స్థానికుల హస్తం ఉందని తేలిందన్నారు. పులి చనిపోయిన స్థలం యజమానిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. ఘటనలో పాల్గొన్న బంగారుపాళ్యం వెలుతురుచేను నుంచి ఇద్దరిని కలిపి ఐదుగురు అనుమానితులను అదుపులో తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి పులి కాళ్లు, గోళ్లు, దంతాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని కలెక్టర్ విద్యుత్శాఖ అధికారులను ఆదేశించారని వెల్లడించారు. విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సోమల మండలంలో ఇటీవల మృతి చెందిన చిరుత ప్రమాదవశాత్తు లోయలో పడి చనిపోయిందన్నారు. యాదమరి పులి ఘటనలో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో రాజశేఖర్తో పాటు, స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నామన్నారు. జిల్లాలోని కౌండిన్య అటవీ ప్రాంతం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో పులుల లెక్కింపు, కదలికలను సక్రమంగా గుర్తించలేకపోతున్నామన్నారు.

శ్రీగంధంను విక్రయిస్తూ: చిత్తూరు నగరంలో శ్రీగంధం విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకుని రిమాండ్కు పంపినట్టు డీఎఫ్ఓ తెలిపారు. నిందితులు నగరానికి చెందిన విజయకుమార్, చిత్తూరు రూరల్కు చెందిన రాజేంద్ర, గణేష్గా గుర్తించామన్నారు. వారి నుంచి రూ.66 వేలు విలువైన 4 కేజీల శ్రీగంధంను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, డీఆర్వో ఆనంద్రెడ్డి, ఎఫ్బీలు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కుసుంతో సోలార్ యూనిట్ల ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవమ్ ఉత్థాన్ మహాభియాన్ యోజనా (పీఎం కుసుం) పథకం ద్వారా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు జెన్కో సీఎండీ చక్రధర్బాబు తెలిపారు. ఆయన గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాలకు చెందిన ఎస్ఈలు, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉండే ప్రభుత్వ స్థలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసి సబ్ స్టేషన్కు విద్యుత్ను సరఫరా చేయవచ్చన్నారు. తద్వారా రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించవచ్చన్నారు. ఫీడర్ల పరిధిలో ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలం ఉందో నివేదిక సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇంటి పైకప్పుపై 3 కేవీ సోలార్ ఫలకాలు పెట్టుకుంటే రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. ఇంటికి వాడుకుని మిగులు విద్యుత్ విలువను లోన్ ఇచ్చిన బ్యాంక్కు జమచేసేలా చర్యలు జరుగుతున్నట్టు చెప్పారు. 4 ఏళ్లలో తీసుకున్న రుణం పూర్తయ్యే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. సోలార్ ఫలకాలు 20 ఏళ్ల కాల పరిమితితో పనిచేస్తాయని వెల్లడించారు. నియోజకవర్గంలో ఒక పంచాయతీలో పూర్తిగా సోలార్ విద్యుత్ వాడేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

పూతలపట్టు: పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని డీపీవో పార్వతి ఆదేశించారు. ఆమె గురువారం పి.కొత్తకోట డంపింగ్ యార్డును పరిశీలించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా టేబుల్ టెన్నిస్ పోటీలు



గెలుపొందిన జిల్లా జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ పోటీలు పోటీపోటీగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వసంతవాణి పర్యవేక్షించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజా కుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. ఓడిపోయామని బాధపడకుండా మరోసారి ప్రయత్నం చేస్తే విజయం తప్పనిసరిగా వరిస్తుందన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. ఇక్కడ గెలుపొందిన జట్లు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నంద్యాలలోని డీఎస్ఏ మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గెలుపొందిన క్రీడాకారులు

అండర్ 17 బాలుర జట్టుకు అనిల్, పురుషోత్తం, చెంచురాముడు (శ్రీకాళహస్తి), భాను (పూతలపట్టు) ఎంపికయ్యారు. అండర్ 17 బాలికల జట్టులో శాలిని (తిరుపతి), మహిత, గేయని (శ్రీకాళహస్తి), సుభాషిని, నిషిత (పూతలపట్టు) ఉన్నారు. అండర్ 14 బాలుర జట్టులో దినేష్, చందు (శ్రీకాళహస్తి), భవ్యష్ (చంద్రగిరి), నవనీత్ (కలికిరి), హర్షిత్ (బృందావన్ స్కూల్, చిత్తూరు), బాలికల జట్టుకు అక్షిత, జ్యోతి, రేఖ (తిరుపతి), నీతుశ్రీ (బృందావన్, చిత్తూరు), దీప్తి మేఘన (శ్రీకాళహస్తి) ఎంపికయ్యారు.

ఎస్జీఎఫ్ అండర్–19 ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 30వ తేదీల్లో వివిధ క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్జీఎఫ్ అండర్–19 కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 26వ తేదీ ఉదయం 9.30 గంటలకు తిరుపతి బాలాజీకాలనీలోని విశ్వేశ్వరయ్య యోగా సెంటర్లో యోగాసన, 27వ తేదీ ఉదయం 9.30 గంటలకు రేణిగుంట జెడ్పీ బాలికల హైస్కూల్లో సాఫ్టటెన్నిస్, స్క్వాష్, ఉషు క్రీడల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 30వ తేదీ ఉదయం 9.15 గంటలకు చిత్తూరులోని డీఎస్ఏ మైదానంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, మల్లకంబ్, ఫెన్సింగ్ క్రీడల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఆయా పోటీలకు హాజరయ్యే బాలబాలికలు పదో తరగతి మార్క్స్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

జిల్లా అండర్–14 కబడ్డీ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–14 బాల బాలికల కబడ్డీ జట్లను గురువారం పుత్తూరులో ఎంపిక చేశారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సెలక్షన్స్ పోటీలను డీవైఈఓ హెచ్.ప్రభాకర్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి 287 మంది బాల బాలికలు పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం తిరుపతి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.బాబు జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్లో బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జిల్లా బాలికల కబడ్డీ జట్టు: టి.సుమతి, బి.అపర్ణ (చౌడేపల్లి), కె.కీర్తి (పాలమంగళం), ఎం.నందినీశ్రీ(దండికుప్పం), ఎస్.బిందు (జోనపల్లి), టి.జోత్స్న (నాగరాజకుప్పం), కె.జాహ్నవి (సదుం), ఎస్.తన్వీక (తిరుపతి), బి.ఆర్.అన్షుక (వెంగలత్తూరు), చందు (పీలేరు), టి.కావ్య (అరణ్యంకండ్రిగ), ఐశ్వర్య (అమిగ్నిపల్లి), జి.సాయి (నాగలాపురం).

బాలుర కబడ్డీ జట్టు: వి.ధరణీధర్, ఎ.గుణశేఖర్ (సదుం), ఎం.భరత్తేజ (అనుకుంట), సి.రిషీ, కె.అజయ్ (నాగలాపురం), టి.వెట్రిసెల్వం (పరమేశ్వరమంగళం), కె.రాకీ (పాలమంగళం), పి.మునికుమార్ (వరదయ్యపాళెం), కె.రోహిత్గాంధీ (నింద్ర), ప్రేమ్కుమార్ (నగరి), అభిషేక్రాజ్ (పిచ్చాటూరు), ఎ.సందీప్కుమార్ (ఎస్సీఆర్పురం).

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

పుత్తూరు: పుత్తూరు మండలం గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎస్జీఎఫ్ అండర్–14 క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.భారతి తెలిపారు. ఆమె గురువారం విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ పూతలపట్టులో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో ఎ.అమృత, ఏకాంబరకుప్పంలో జరిగిన నెట్బాల్ బాలుర విభాగంలో లక్ష్మీనారాయణ, రేవంత్, లవకుమార్, బాలికల విభాగంలో యశ్మిత, పవిత్ర, జననీ ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ 9వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నింద్ర విద్యార్థిని..



మోనిషా

నింద్ర: రాష్ట్ర స్థాయి అండర్–14 నెట్ బాల్ పోటీలకు నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె.మోనిషా ఎంపికైనట్టు హెచ్ఎం శివయ్య తెలిపారు. నగరి ఏకాంబరకుప్పంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మోనిషా ప్రతిభ చూపిందని పేర్కొన్నారు. వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు వైజాగ్లో జరిగే రాష్ట్ర స్థాయి నెట్బాల్ పోటీల్లో పాల్గొననున్నట్టు వెల్లడించారు. ఆమెను పీడీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులతో ఉపాధ్యాయులు